సూర్యోదయ వార్త

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల కోసం...

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి: 2 | సంచిక : 29 | శనివారం24.10. 2026 | పేజీలు :4 | వెల: 2

యువశక్తితోనే శక్తిమంత భారత్!



- దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే మహాశక్తి యువతే: ప్రధాని మోదీ
- ఢిల్లీలో చిన్మయ అమృత మహోత్సవ ప్రపంచ సమ్మేళనం ప్రారంభం
- స్వామి చిన్మయానందతో 1993 నాటి అనుబంధాన్ని గుర్తుచేసుకున్న ప్రధాని
- గుజరాత్ సీఎంగా ఉన్నప్పటి నుంచే యువతకు ప్రాధాన్యమిచ్చానని వెల్లడి

నేహా బోరాకు ఢిల్లీ హైకోర్టు షాక్

ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ అధ్యక్షురాలు నేహా బోరాకు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. నిరసనల్లో పాల్గొన్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు రూ. 10,000 వ్యక్తిగత పీస్ బాండ్ సమర్పించాలని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు అక్టోబర్ 17న జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.



భారత్-చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తత

అరుణాచల్ ప్రదేశ్‌లో భారత్-చైనా వాస్తవ నియంత్రణ రేఖ వెంబడి ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయంటూ ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ సింగ్ కపూర్ చేసిన వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది.





రేవంత్ హడావుడి ఏడాదే

మళ్లీ కేసీఆరే సీఎం కావడం ఖాయమన్న కేటీఆర్

కాళేశ్వరంపై కాంగ్రెస్ ఉద్దేశపూర్వక కుట్ర

బీఆర్ఎస్‌పై ఆరోపణలకు బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటయ్యాయి

స్థానిక ఎన్నికలు నిర్వహించే దమ్ముందా అని సవాల్

సమన్వయంతోనే నేర రహిత దక్షిణ భారతం

నేరాల కట్టడికి రాష్ట్రాల మధ్య సమన్వయం ఎంతో కీలకం

- ఐసీసీసీ, సాంకేతికతను పంచుకునేందుకు సిద్ధం
- హైడ్రా, ఈగల్, టీజీ-సేఫ్ తో సత్ఫలితాలు
- పోలీసుల పిల్లల కోసం యంగ్ ఇండియా స్కూల్
- అమరవీరుల కుటుంబాలకు రూ.2 కోట్ల పరిహారం
- పోలీసు సమన్వయ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి



> దక్షిణ భారతదేశాన్ని అత్యంత సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అన్ని రాష్ట్రాల పోలీసుల మధ్య పటిష్టమైన సమన్వయం, సరిహద్దులు దాటి సమాచార మార్పిడి జరగడం ఎంతో కీలకమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నేరాల నియంత్రణ కోసం అవసరమైతే తెలంగాణ పోలీసు ఆధునిక సాంకేతికతను, ఐసీసీసీ వ్యవస్థను పొరుగు రాష్ట్రాలతో పంచుకునేందుకు తమ ప్రభుత్వం పూర్తి సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. హైదరాబాద్ వేదికగా బుధవారం అట్టహాసంగా జరిగిన దక్షిణాది రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల (ఎస్ఆర్‌పీసీసీ) సదస్సును ప్రారంభించిన సందర్భంగా సీఎం ఈ మేరకు కీలక దిశానిర్దేశం చేశారు

హైదరాబాద్ సూర్యోదయ వార్త

దక్షిణ భారతదేశాన్ని అత్యంత సురక్షితమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు దక్షిణాది రాష్ట్రాలన్నీ సమన్వయంతో, సమిష్టిగా కృషి చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో ఏర్పాటు చేసిన దక్షిణ ప్రాంతీయ పోలీసు సమన్వయ కమిటీ (ఎస్ఆర్‌పీసీసీ) సదస్సును బుధవారం ఆయన

మిగతా 2 లో

కరువు ముప్పుపై అప్రమత్తంగా ఉండాలి!

ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర నీటి ఎద్దడి తప్పదు

ప్రజాప్రతినిధుల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

2

తుమ్మిడిహెట్టిపై భేటీకి సిద్ధం కండి!

వివరాలు 2వ పేజీలో

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఐ మద్దతు కోరిన కాంగ్రెస్



రానున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి మద్దతు ఇవ్వాలని సీపీఐని కాంగ్రెస్ పార్టీ కోరింది. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఇరు పార్టీల నేతలు సమావేశమయ్యారు. ఈ భేటీలో రెండు పార్టీల మధ్య రాజకీయ సమన్వయం, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఇండియా కూటమిలో సీపీఐ భాగస్వామిగా ఉందని, గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేసిందని గుర్తుకు చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజాక్షేత్రంలో సీపీఐతో కలిసి ముందుకు సాగుతున్నామని తెలిపారు.రాబోయే రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు సీపీఐ మద్దతు కోరినట్లు వెల్లడించారు. అలాగే, ఈ ఎన్నికల్లో మద్దతు కోసం సీపీఎంతోనూ చర్చలు కొనసాగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ తరఫున మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ మల్లు రవి పాల్గొన్నారు. సీపీఐ తరఫున రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జాతీయ కార్యవర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పీఎస్ బోస్, ఈటీ నరసింహ, తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, కలవేని శంకర్, బాల నరసింహ తదితరులు హాజరయ్యారు.

బాధితులకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి!

మాజీ మంత్రి హరీశ్ రావు





బయట బ్రాండ్.. లోపల కల్తీ!

ఎలుకల మలం మధ్యే మిఠాయిల తయారీ

ఆల్మండ్ హౌస్, దాదూస్‌లకు అధికారుల నోటీసులు

3

గ్రేటర్‌లో మూడు కార్పొరేషన్లూ గెలుస్తాం: కవిత



త్వరలో జరగబోయే గ్రేటర్ ఎన్నికల్లో మూడు కార్పొరేషన్లలో తెలంగాణ రక్షణ సేన గెలుపు ఖాయమని ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. మియాపూర్‌లో శుక్రవారం పార్టీ గ్రేటర్ అధ్యక్షుడు వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ అధ్యక్షతన 'రాజధాని రణభేరి' పేరిట నిర్వహించిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. "మౌలిక వసతులు కల్పించకుండా హైదరాబాద్‌ను విశ్వనగరంగా అభివృద్ధి చేస్తామంటూ ముఖ్యమంత్రి మాట్లాడటం విడ్డూరంగా ఉంది. రాష్ట్రానికి రూ.6.50 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు సత్యదూరంగా ఉన్నాయి. ఈ అంశంపై శ్వేతపత్రం విడుదల చేయాలి. లేకపోతే త్వరలోనే జరగబోయే గ్లోబల్ సమిట్‌ను అడ్డుకుంటాం. హైదరాబాద్‌లో చెత్త సేకరణను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే.. 50 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు ఉపాధి కోల్పోతారు" అని కవిత పేర్కొన్నారు.

రాజకీయ భిక్ష పెట్టిన ప్రజలకే సీఎం రేవంత్ రెడ్డి అన్యాయం

రాజకీయంగా అండగా నిలిచి, సీఎం కావడానికి సహకరించిన ప్రజలకే రేవంత్‌రెడ్డి అన్యాయం చేస్తున్నారని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. జవహర్‌నగర్ డంప్‌యార్డ్ తరలింపు ఉద్యమం, పాదయాత్ర సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఆయన.. బీజేపీ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టనున్న పోరాటానికి బీజేపీ శాసనసభా పక్షం (బీజేఎల్పీ), పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులంతా ఈ ఉద్యమంలో భాగస్వాముల వుతారని స్పష్టం చేశారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కల్పించిన జీవించే హక్కులో భాగంగా ప్రజలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే, తెలంగాణలో ప్రజలకు ఈ హక్కును కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాజ్యాంగం గురించి మాట్లాడే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డికి రాజకీయంగా అండగా నిలిచిన ప్రజలే నేడు జవహర్‌నగర్ డంప్‌యార్డ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజల ఆరోగ్యం, హక్కులను కాపాడాల్సిన బాధ్యత సీఎంకు లేదా అని నిలదీశారు. 30 ఏళ్లుగా జవహర్‌నగర్ డంప్‌యార్డ్ కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.



ప్రభుత్వ భూములను రక్షించాలి...

- అదనపు జిల్లా కలెక్టర్ మహేందర్‌జీకి వినతి పత్రం ఇచ్చిన ఆదివాసీ జాక్ నాయకులు..
- అటవీ శాఖా అధికారుల ఆగడాలకు అడ్డుకట్ట వేసేదేవరు..?



వెంకటాపురం. ములుగు జిల్లా .నూగూరు అక్టోబర్ 23(సూర్యోదయ వార్త)

– ఐదో షెడ్యూల్ ప్రాంతం లో ఆదివాసీల భూములను రక్షించడానికి తెచ్చిన 1/59,1/70 చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని వాటిని అమలు చేయాలనీ అదనపు జిల్లా కలెక్టర్ మహేందర్ జీ కి వెంకటాపురం తహసీల్దార్ కార్యాలయం లో ఆదివాసీ జాక్ నాయకులు వినతిపత్రం శుక్రవారం అందజేశారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నయనీ, వాటిని రక్షించాల్సిన బాధ్యత అధికారుల పైన ఉందని వినతిపత్రం లో పేర్కొన్నట్టు నాయకులు పూనెం సాయి, కొర్స నర్సింహా మూర్తి, ప్రతాప్ తెలిపారు. ఎల్ టి ఆర్ చట్టాలు ఉన్నప్పటికీ వాటిని ఎందుకు అమలు చేయడం లేదని వారు మహేందర్ జీ ని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో ఉన్న వనరులను తీసుకోని వెళ్ళడానికి ఉన్న శ్రద్ద బాధ్యత ఆదివాసీల భూములను, ప్రభుత్వ భూములను రక్షించడం లో ఎందుకు లేదని నిలదీశారు. అటవీ శాఖా అధికారులు ప్రభుత్వ భూములను కాజేసి తమ భూములే అని దబాయిస్తున్నారని తెలిపారు. షెడ్యూల్ చట్టాలను అనుసరించకుండా ప్రభుత్వ భూములను తమయే అని, అడ్డు వస్తే కేసులు పెడతామని అటవీ శాఖా అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. అటవీ శాఖా అధికారులు అక్రమంగా కాజేసిన ప్రభుత్వ భూములను వెనక్కి తీసుకోవాలని అదనపు జిల్లా కలెక్టర్ ని కోరినట్లు నాయకులు వివరించారు. ఎల్ టి ఆర్ చట్టాన్ని ఉల్లంఘించి ప్రభుత్వ భూములకు పట్టాలు పొందిన వలస గిరిజనేతరుల వద్ద వేలాది ఎకరాలు ఉన్నాయని అన్నారు. వాటన్నిటిని తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేద ప్రజలకు పంచాలని అన్నారు. లేని క్రమంలో పోరాటాలు ఉప క్రమిస్తామని హెచ్చరించారు..

అఖినపల్లి మల్లారంలో బాధిత కుటుంబానికి కుంజ సూర్య రామ్ పరామర్శ..

5000 ఆర్థిక సహాయం అందచేత



మంగపేట,అక్టోబర్ 23:(సూర్యోదయ వార్త)

ములుగు జిల్లా మంగపేట మండలంలోని అఖినపల్లి మల్లారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు,మాజీ సహకార సంఘం డైరెక్టర్ యలగొండ పెద్దలక్ష్మయ్య కుమార్తె సంగీత అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క తనయుడైన కుంజ సూర్య రామ్ పార్టీ నాయకులతో కలిసి సంగీత నివాసానికి వెళ్లి,కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.బాధిత కుటుంబానికి మనోధైర్యం కల్పిస్తూ,?5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ పరామర్శలో మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు,జాతీయ స్పైసెస్ బోర్డ్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివ రెడ్డి,ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అయ్యోరి యానయ్య,ములుగు మార్కెట్ కమిటీ సభ్యులు కొమురం బాలన్న,లక్కీ వెంకన్న,ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సభ్యులు మురుకుట్ల నరేందర్,యువజన కాంగ్రెస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల భరత్ కుమార్,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొంకతి సాంబశివరావు,టి కొత్తగూడెం ఉప సర్పంచ్ చెట్టిపెల్లి ప్రసాద్,గద్దల సాయి,తాలూక సంపత్,బోడ బొరయ్య,లంజపెల్లి కిరణ్,మరియు తదితరులు పాల్గొన్నారు.

బూరుగుపేట ఘటనపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి



ములుగు వెంకటాపూర్(ఎం)అక్టోబర్ 23 (సూర్యోదయవార్త)

– ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం బూరుగుపేటలో గ్రామ కార్యదర్శిపై జరిగిన దుర్భాషలాడటంపై శ్యామ్ మాదిగ తీవ్రంగా స్పందించారు. గురువారం ఆయన మాట్లాడుతూ పోలీసులు వెంటనే ఈ ఘటనపై విచారణ చేపట్టి ఆధారాలను సేకరించాలని డిమాండ్ చేశారు. విచారణలో నిందితుడు సేద సారంగంపై ఆరోపణలు రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే బాధిత కార్యదర్శికి రక్షణ కల్పించి, భవిష్యత్తులో విధుల నిర్వహణలో ఎటువంటి ఒత్తిడి లేకుండా చూడాలని ఉన్నతాధికారులను ఆయన కోరారు.మండలం బూరుగుపేటలో గ్రామ కార్యదర్శిపై జరిగిన దుర్భాషలాడటంపై శ్యామ్ మాదిగ తీవ్రంగా స్పందించారు. గురువారం ఆయన మాట్లాడుతూ పోలీసులు వెంటనే ఈ ఘటనపై విచారణ చేపట్టి ఆధారాలను సేకరించాలని డిమాండ్ చేశారు. విచారణలో నిందితుడు సేద సారంగంపై ఆరోపణలు రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే బాధిత కార్యదర్శికి రక్షణ కల్పించి, భవిష్యత్తులో విధుల నిర్వహణలో ఎటువంటి ఒత్తిడి లేకుండా చూడాలని ఉన్నతాధికారులను ఆయన కోరారు..

సౌత్ జోనల్ కరాటే పోటీలకు ఏటూరు నాగారం విద్యార్థులు



ఏటూరు నాగారం. ములుగు జిల్లా అక్టోబర్ 23 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

ములుగు జిల్లా ఏటూరు నాగారం కరాటే అకాడమీకి చెందిన ఏడుగురు విద్యార్థులు ఈనెల అక్టోబర్ 24 నుండి 26 వరకు విశాఖపట్నంలో జరిగే సౌత్ జోనల్ కరాటే ఛాంపియన్ షిప్ – 2026 పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకుల మరి లక్ష్మణ్ బాబు. సర్పంచ్ శ్రీలత. రు. 20 వేలు ఇతర ప్రముఖులు రూ 15 వేల సాయం అందజేశారు. కరాటే మాస్టర్లు అబ్బు.హుస్సేన్ విద్యార్థులను అభినందించారు..

శంకరాజుపల్లిలో అభివృద్ధి పనుల జోరు..

- కేకే గూడెం కాలనీలో డ్రైనేజీ పనులు ప్రారంభం!
- సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క సహకారంతో గ్రామాభివృద్ధికి పెద్దపీట..
- రూ.2.45 కోట్ల నిధులతో శంకరాజుపల్లిలో ముమ్మరంగా అభివృద్ధి పనులు..

ఏటూరునాగారం, ములుగు జిల్లా అక్టోబర్ 23:.(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం శంకరాజు పల్లి గ్రామంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క సహకారంతో గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారు. గ్రామ సర్పంచ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవులపల్లి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో, 6వ



వార్డు సభ్యురాలు తాటి శ్రీలత--నీలాద్రి సమక్షంలో కేకే గూడెం కాలనీలో డ్రైనేజీ పనులను ప్రారంభించారు. కాలనీలో మురుగునీటి సమస్యలను పరిష్కరించి, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు ఈ పనులు ఎంతగానో దోహదపడనున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడటంతో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తగ్గి, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు అవకాశం కలగనుంది. శంకరాజుపల్లి గ్రామ అభివృద్ధి కోసం ఎస్సీఎస్డిఎఫ్ని అభివృద్ధి నిధుల కింద రూ. 1.95 కోట్లు, ఐటీడీఏ నిధుల కింద రూ.50 లక్షలు కలిపి మొత్తం రూ.2.45 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుంటూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు స్థానిక నాయకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్య సదుపాయాల కల్పనతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు...

వారసత్వ సంపద పరిరక్షణలో యువత భాగస్వాములు కావాలి

- రామప్పలో 12 రోజుల ప్రపంచ వారసత్వ స్వచ్ఛంద సేవా శిబిరం
- సమ్మక్క సారలమ్మ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ఉపకులపతి శ్రీనివాస్

ములుగు. అక్టోబర్ 23(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

చరిత్ర, సంస్కృతి, వారసత్వ సంపదపై యువత అవగాహన పెంచుకొని, వాటి ప్రాధాన్యాన్ని ఇతరులకు తెలియజేయాలని సమ్మక్క సారలమ్మ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ఉపకులపతి శ్రీనివాస్ సూచించారు. తెలంగాణ పర్యాటకశాఖ సౌజన్యంతో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామప్పలో నిర్వహిస్తున్న ప్రపంచ వారసత్వ స్వచ్ఛంద సేవా శిబిరం--2026 కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా పర్యాటక నోడల్ అధికారి డాక్టర్ ఎ. ధర్మానాయక్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. దేశంలోని 10 రాష్ట్రాలకు చెందిన 35 మంది స్వచ్ఛంద సేవకులు ఈ 12 రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.ఈ సందర్భంగా ఉపకులపతి శ్రీనివాస్ మాట్లాడుతూ, పర్యాటకం, సంస్కృతి, వారసత్వం, భూగర్భ శాస్త్రం వంటి పలు అంశాలను తెలుసుకునేందుకు ఈ శిబిరం విద్యార్థులకు ఉపయోగపడుతుందని అన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం





చేసుకొని, నేర్చుకున్న విషయాలను ఇతరులతో పంచుకోవాలని సూచించారు. చారిత్రక ప్రదేశాల విశిష్టతను విస్తృతంగా ప్రచారం చేస్తూ, వారసత్వ సంపద పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.జిల్లా పర్యాటక నోడల్ అధికారి డాక్టర్ ఎ. ధర్మానాయక్ మాట్లాడుతూ, శిబిరం నిర్వహణకు పర్యాటక శాఖ తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు. పర్యాటక పోలీసుల ద్వారా భద్రత కల్పిస్తామని పేర్కొన్నారు.రామప్పకు ప్రపంచ వారసత్వ గుర్తింపు లభించినప్పటి నుంచి వరుసగా ఐదో ఏడాది ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. రామప్పకు గుర్తింపు సాధించడంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ చేసిన కృషి, పోషించిన పాత్రను కార్యక్రమంలో వివరించారు. శిబిరంలో కల్పించే సౌకర్యాలు, విద్యార్థులు పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. చరిత్రను తెలుసుకోవడం, వారసత్వ సంపదను పరిరక్షించడం, నేర్చుకున్న విషయాలను ఇతరులతో పంచుకోవడం ద్వారా చారిత్రక ప్రదేశాలకు మరింత ప్రాచుర్యం కల్పించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధి ప్రొఫెసర్ పాండురంగారావు, శిబిర సమన్వయకర్త శ్రీధర్ రావు, భారత పురావస్తు సర్వేక్షణ శాఖ పరిరక్షణ సహాయకుడు భార్గవ్, పర్యాటక శాఖ సహాయ పర్యాటక ప్రోత్సాహక అధికారి డాక్టర్ కుసుమ సూర్యకిరణ్, ఆలయ పూజారులు ఉమాశంకర్, హరిశంకర్, పర్యాటక శాఖ సిబ్బంది, పర్యాటక పోలీసులు, దేవస్థానం సిబ్బంది, పర్యాటక మార్గదర్శకులు, వివిధ రాష్ట్రాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు...

జనాభా గణన బ్లాకులను పటిష్టంగా ఏర్పాటు

- ముగిసిన జనాభా గణన- -2027 రెండవ దశ శిక్షణ..
- ములుగు జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు

ములుగు. అక్టోబర్ 23(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

జనాభా గణన--2027లో భాగంగా గణన బ్లాకులు, ఉప గణన బ్లాకులను పటిష్టంగా ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు సూచించారు.ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జనాభా గణన--2027 రెండవ దశకు సంబంధించి గణన బ్లాకులు, ఉప గణన బ్లాకుల ఏర్పాటుపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు





ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన జనాభా గణనలోని 40 ప్రశ్నలు, స్వీయ గణన, సీఎంఎంఎస్ పోర్టల్‌పై అవగాహన కల్పించారు. హైదరాబాద్‌లోని జనాభా గణన సంచాలకుల కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు యువేందర్ బాబు, నాయుడు రెండు రోజులపాటు శిక్షణ ఇచ్చారు.ఈ శిక్షణలో జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్, ఆర్డీఓ కృష్ణవేణి, ఛార్జ్ అధికారులైన తహసీల్దార్లు, అదనపు ఛార్జ్ అధికారులైన మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ముఖ్య ప్రణాళిక అధికారి బి. జవహర్ లాల్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, గణాంక అధికారులు భూక్యా లాల్ నాయక్, ఎం. రమేష్ బాబు, ఈడీఎం దేవేందర్ పాల్గొన్నారు..

పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి..

- ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం..
- తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి కుంజ సూర్య రామ్

మంగపేట.ములుగు జిల్లా. అక్టోబర్ 23(సూర్యోదయ వార్త.)

ములుగు జిల్లా మంగపేట మండలంలోని రాజుపేట గ్రామంలో శుక్రవారం మండల పార్టీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పట్టభద్రులు సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క తనయుడు తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి కుంజ సూర్య రామ్ హాజరై మాట్లాడుతూ అర్హులైన పట్టభద్రులందరూ రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తమ ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కకోరారు..ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం అని,ప్రతి అర్హత కలిగిన పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ముందుగానే ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.– పట్టభద్రుల ఓటు నమోదుకు ముఖ్యమైన వివరాలు: – దరఖాస్తుకు చివరి



తేదీ:నవంబర్ 6, 2026. దరఖాస్తు ఫారం: పారం -18 భారతదేశంలోని గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం/విద్యాసంస్థ నుంచి డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలి. సంబంధిత పట్టభద్రుల నియోజకవర్గంలో సాధారణ నివాసి అయి ఉండాలి...

– అర్హత..

– నవంబర్ 1, 2026 నాటికి కనీసం మూడు సంవత్సరాల ముందే డిగ్రీ లేదా ఎన్నికల నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన తత్సమాన విద్యార్హతను పూర్తి చేసి ఉండాలి..

– ముఖ్య గమనిక...

– గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేరు ఉన్నప్పటికీ,కొత్తగా రూపొందించే ఓటరు జాబితా కోసం ప్రతి అర్హుడూ ఖీశీతీఎ-18 ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి.గత జాబితాలో పేరు ఉన్నదనే కారణంతో కొత్త జాబితాలో పేరు స్వయంచాలకంగా కొనసాగుతుందని భావించకూడదు.అందువల్ల మంగపేట మండలంలోని అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నవంబర్ 6వ తేదీలోపు పారం -18 ద్వారా ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలని ఈ నమోదుకు సీనియర్ కాంగ్రెస్ నాయకులు మరియు యువజన కాంగ్రెస్ నాయకులు అన్ని రకాలుగా పట్టబద్రులకు సహకరించాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు అయ్యోరి యానయ్య, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఇస్సార్ ఖాన్, ములుగు మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొమరం బాలన్న, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సభ్యులు మురుకుట్ల నరేందర్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బాడిషా ఆదినారాయణ, ఐఎన్టియుసి మండల అధ్యక్షులు పుల్లూరి తిరుపతి, రాజుపేట మాజీ సర్పంచ్ చందర్లపాటి శ్రీనివాస్ రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొంకతి సాంబశివరావు, పట్టభద్రులు, పాల్గొన్నారు..

తెలుగు దినపత్రిక
సూర్యోదయ వార్త
ప్రతి అక్షరం ప్రజల కోసం...

కనువిందు చేస్తున్న పల్లె ప్రకృతి అందాలు...



- ఏటూరునాగారం. ములుగు జిల్లా.అక్టోబర్ 23(సూర్యోదయవార్త.. ములుగు ప్రతినిధి)

ములుగు జిల్లా ఏటూర్ నాగారం మండలం కొండాయిలో తెల్లవారుజామున పకృతి అందాలు పంచుతున్నాయి. ఉదయించే సూర్యుడు. మంచు తెరల మధ్య కనిపించే తాడిచెట్టు. పచ్చని పరిసరాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. చల్లని గాలులు. పక్షుల కిలకిల రాగాలు. పల్లె వాతావరణానికి మరింత శోభను తెస్తున్నాయి. వాహనాల రణ గోల ధ్వనులు కాలుష్యానికి దూరంగా పకృతి ఒడిలో సాగుతున్న ఉదయం ప్రశాంతతను అందిస్తుంది

అమరుల త్యాగం వెలకట్టలేనిది..

పస్రా సిఐ దయాకర్.. ఎస్సై - తాజుద్దీన్



గోవిందరావుపేట అక్టోబర్ 23 (సూర్యోదయవార్త.)-

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా లో శుక్రవారం రోజున పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా పస్రా సీఐ దయాకర్,మరియుఎస్ ఐ తాజుదీన్ మాట్లాడుతు పోలీస్ ప్రాణాలు ఇచ్చి.. ప్రజలను కాపాడిన త్యాగధనులకు సెల్యూట్ పెడూతు పస్రా వీధుల్లో వెలిగిన కొవ్వొత్తుల కాంతుల్లో అమరవీరుల త్యాగాలు ప్రతిబింబించాయి.విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరులకు పస్రా పోలీసులు ఘనంగా నివాళులర్పించారు. పోలీస్ స్టేషన్ నుండి మేడారం సెంటర్, జంక్షన్ వరకు చేపట్టిన క్యాండిల్ ర్యాలీ అందరినీ ఆకట్టుకుంది.ఖాకీ వెనుక దాగున్న త్యాగం ఎంతో గొప్పదని, వారి సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని ఈ సందర్భంగా కొనియాడారు....

కొమురం భీమ్ ఆశయ సాధనలో మంత్రి సీతక్క...



ములుగు అక్టోబర్ 23 (సూర్యోదయవార్త. ములుగు ప్రతినిధి)

జల్... జంగల్... జమీన్... ఆదివాసీ ఆత్మగౌరవ నినాదం!అడవి బిడ్డల హక్కుల కోసం అగ్గిరవ్వై రగిలిన వీరుడు, ఆదివాసీ గుండెల్లో ఆత్మగౌరవ జెండా ఎగరేసిన ధీరుడు! "జల్... జంగల్... జమీన్..." అంటూ జాతి హక్కుల కోసం పోరాడిన మహావీరుడు కొమురం భీమ్!ఆ వీరుడి ఆశయమే సీతక్క అడుగులకు స్ఫూర్తి, ఆదివాసీల అభ్యున్నతే ఆమె ప్రజాసేవకు నిజమైన కీర్తి! అడవిని నమ్ముకున్న బిడ్డలకు అండగా నిలుస్తూ, అణగారిన గుండెల్లో ఆశల దీపాలు వెలిగిస్తూ!భీమ్ కన్న కలలను నిజం చేసే దిశగా అడుగులు, గిరిజన జీవితాల్లో వెలుగులు నింపే ప్రజాసేవా బాటలు! హక్కుల కోసం నాడు భీమ్ చేసిన వీరోచిత పోరాటం, నేడు సీతక్క సేవలో కొనసాగాలి ఆ ఆశయాల పయనం!జల్ మన హక్కు... జంగల్ మన జీవనం... జమీన్ మన ఆత్మగౌరవం... ఇదే భీమ్ మహా సందేశం!కొమురం భీమ్ స్ఫూర్తితో ముందుకు సాగుదాం, ఆదివాసీ హక్కుల పరిరక్షణకు ఐక్యంగా నిలుద్దాం! మంత్రి సీతక్క నాయకత్వంలో ఆశయ సాధనకు కదులుదాం, కొమురం భీమ్ కలల తెలంగాణ కోసం కలిసికట్టుగా పోరాడుదాం అని కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు, అభినులు, ప్రజలు కోరుతున్నారు.

పురుగుల మందు తాగి యువకుడు మృతి...

కన్నాయిగూడెం. ములుగు జిల్లా అక్టోబర్ 23 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)



– ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం ఐలాపురం గ్రామానికి చెందిన యాలం సాగర్ (23) పురుగుల మందు తాగి మృతి చెందాడు.అని స్థానికులు తెలిపారు. గ్రామానికి వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేక దొడ్ల- మల్యాల మధ్య బ్రిడ్జి పూర్తి కాకపోవడంతో 108 వాహనాలు గ్రామానికి చేరుకోవడంలో ఇబ్బ ందులు ఎదురవుతున్నాయని స్థానికులు తెలిపారు. సరైన సమయానికి వాయిద్యం అందితే బతికేవాడని కుటుంబీకులు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలి

- హౌసింగ్ సొసైటీల జేఏసీతో చర్చించి సమస్య పరిష్కరించాలి
- హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్లు, బస్సు పాసులు కల్పించాలి
- తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ డిమాండ్



పాల్వంచ (సూర్యోదయ వార్త)

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యపై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) డిమాండ్ చేసింది. జర్నలిస్టు హౌసింగ్ సొసైటీల జేఏసీతో చర్చించి, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం చూపాలని కోరింది. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్లు, బస్సు పాసులు కల్పించాలని విజ్ఞప్తి చేసింది. శుక్రవారం పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో రాళ్లబండి కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టిడబ్ల్యూజేఎఫ్ సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు జర్నలిస్టుల సమస్యలపై తమ గళాన్ని వినిపించారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధన, సంఘటిత పోరాటాలే లక్ష్యంగా ఫెడరేషన్ పనిచేస్తుందని స్పష్టం చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బట్టిపాటి రాజశేఖర్ మాట్లాడుతూ, జర్నలిస్టులు సమాజంలోని అవినీతిని వెలికితీస్తూ, పేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని అన్నారు. జర్నలిజంలో విలువలు దిగజారకుండా వృత్తి బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఫెడరేషన్ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఫెడరేషన్ పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం జీవో 252ను సవరించిందని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని, త్వరలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఖదీర్ మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కుల సాధన కోసం అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకైనా సిద్ధమని ప్రకటించారు. ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల విషయంలో ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఖమ్మం జిల్లాలో నిర్వహించిన పాదయాత్ర రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసిందని తెలిపారు. ప్రభుత్వాలు హామీలకే పరిమితం కాకుండా వాటిని అమలు చేయాలని కోరారు. టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యలపై సాగిన పోరాటాల నుంచే ఫెడరేషన్ ఆవిర్భవించిందన్నారు. ఖమ్మంలో పలు అడ్డంకులను అధిగమించి పాదయాత్రను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు సాగర్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కావాలంటే ఐక్యంగా, బలంగా ఉద్యమించాలని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఫెడరేషన్ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఫెడరేషన్ నాయకుడు పారుపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు, బస్సు పాసులు, హెల్త్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సంఘ టితంగా ముందుకు సాగాలని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఫెడరేషన్‌ను మరింత బలోపేతం చేయాలని సమావేశం పిలుపు నిచ్చింది. ఈ సమావేశంలో టిడబ్ల్యూ జేఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు దాసరి వెంకటేశ్వరరావు, టీఎస్ చక్రవర్తి, సీనియర్ నాయకులు సూరిబాబు, నాగవర్మ, జానీ పాషా, ఖమ్మం జిల్లా నాయకులు తేనె వెంకటేశ్వర్లు, నాగేంద్ర రెడ్డి, ఇమ్మంది ఉదయ్ కుమార్, కోడారి వెంకటేశ్వర్లు, ప్రవీణ్, సీహెచ్‌వీ నరసింహారావు, సురేష్, వేణుగోపాల్, రాధాకృష్ణ, ఎన్. రమేష్, రాజేందర్, ఎస్‌వీ సంతోష్, మోహన్ రావు, మధు తదితరులు పాల్గొన్నారు.

అనంతుల లక్ష్మీనారాయణ కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇవ్వాలి

- టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్..
- ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరపాలి
- బాధిత కుటుంబానికి ఇంటి స్థలం, ఇల్లు కేటాయించాలి
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి





పాల్వంచ (సూర్యోదయ వార్త)

హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ అనంతుల లక్ష్మీనారాయణ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఆయన ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. శుక్రవారం పాల్వంచలోని మృతుడి నివాసానికి వెళ్లిన టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఎస్కే ఖదీర్‌తో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు అనంతుల లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఆయనపై వేధింపులు జరిగాయా? మానసిక ఒత్తిడికి గురిచేసిన పరిస్థితులు ఏమిటి? అనే అంశాలపై నిష్పాక్షికంగా విచారణ జరపాలని నాయకులు కోరారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ప్రత్యేక చొరవ తీసుకుని దర్యాప్తును వేగవంతం చేసి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. హెచ్‌పీ గ్యాస్ సంస్థకు అనంతుల లక్ష్మీనారాయణ ఎంతో నిబద్ధతతో సేవలందించారని నాయకులు పేర్కొన్నారు. కరోనా సమయంలో, గ్యాస్ కొరత ఏర్పడిన సందర్భాల్లోనూ వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా సేవలందించారని, ఆయన సేవలకు గుర్తింపుగా పలు అవార్డులు కూడా అందుకున్నారని గుర్తుచేశారు. అలాంటి ఉద్యోగి మృతి చెందడం బాధాకరమని, కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారంతో పాటు ఇంటి స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలని, కుటుంబంలోని ఒకరికి ఉద్యోగావకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హెచ్‌పీ గ్యాస్ సంస్థ యాజమాన్యం కూడా అంతర్గత విచారణను నిష్పాక్షికంగా నిర్వహించాలని కోరారు. విచారణలో వేధింపులు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు రాళ్లబండి కృష్ణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు దువ్వ సాగర్, కోశాధికారి వెంకటేశ్వర్లు, వ్యవస్థాపక అధ్యక్షుడు పి. కృష్ణారావు, సీనియర్ నాయకులు సూరిబాబు, కొడాలి వెంకటేశ్వర్లు, వేణు, రమేష్ కుమార్, నందిపాటి రమేష్, జలాల్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం రైల్వే సమస్యలకు పరిష్కారం చూపండి

రైల్వే బోర్డు మెంబెర్ భీమా శ్రీధర్ వినతి



కొత్తగూడెం (సూర్యోదయ వార్త)

కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు, గతంలో రద్దు చేసిన కొల్హాపూర్, కాజీపేట, డోర్నకల్ రైళ్లను తక్షణమే పునఃప్రారంభించాలని నూతన సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ డీఆర్‌యూసీసీ మెంబర్ భీమా శ్రీధర్ రైల్వే అధికారులను కోరారు. సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ డివిజన్ డీఆర్ఎం గోపాలకృష్ణను కలిసి పలు సమస్యలతో కూడిన వినతులను సమర్పించారు. వచ్చే ఏడాది జూన్, జూలై నెలల్లో జరగనున్న గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు పూర్తి చేసి, భక్తులకు, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని భీమా శ్రీధర్ కోరారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పర్యవేక్షించేందుకు ప్రత్యేక రైలులో వచ్చిన డీఆర్ఎం గోపాలకృష్ణ కు నూతన డీఆర్‌యూసీసీ మెంబర్ భీమా శ్రీధర్, 60వ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ, రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, పుష్కరాలకు వచ్చే భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. గతంలో రద్దు చేసిన కొల్హాపూర్, కాజీపేట, డోర్నకల్ రైళ్లను తిరిగి నడిపించాలని కోరారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ సెంటర్ నుంచి గొల్లగూడెం వరకు రోడ్డు విస్తరణకు అవసరమైన రైల్వే స్థలాన్ని కేటాయించాలని భీమా శ్రీధర్ డీఆర్ఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ రహదారి విస్తరణ పూర్తయితే స్థానిక ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గుతాయని వివరించారు. ఈ అంశంపై గతంలో ఖమ్మం రైల్వే స్టేషన్ కోసం ప్రభుత్వ భూమిని కేటాయించిన నేపథ్యంలో, కొత్తగూడెంలో రోడ్డు విస్తరణకు కేటాయించిన స్థలానికి తక్షణమే హద్దులు ఏర్పాటు చేసి, రహదారి నిర్మాణానికి సహకరించాలని కోరారు.

దేవిక్ నందన్ అన్నప్రసన్న వేడుకకు హాజరైన. - యువ నేత..


యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కుంజ సూర్య రామ్



మంగపేట.అక్టోబర్ 23:(సూర్యోదయ వార్త.)

– ములుగు జిల్లా మంగపేట మండలంలోని అఖినపెల్లి మల్లారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజమల్ల సుకుమార్––సంధ్య దంపతుల కుమారుడు దేవిక్ నందన్ అన్నప్రసన్న వేడుకకు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క తనయుడు,తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి కుంజ సూర్య రామ్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు, జాతీయ స్పైసెస్ బోర్డ్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివ రెడ్డి, ములుగు జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు అయ్యోరి యానయ్య,ములుగు మార్కెట్ కమిటీ సభ్యులు కొమురం బాలన్న,లక్కీ వెంకన్న,ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పల్లికొండ యాదగిరి,యువజన కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి ఎడ్ల నరేష్,ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు మురుకుట్ల నరేందర్,మండల ప్రధాన కార్యదర్శి కొంకతి సాంబశివరావు,జంగం భానుచందర్,ఎంపెల్లి వీరాస్వామి, మూగల చంటి,పుల్లూరి తిరుపతి,గద్దల సాయి,చెట్టిపెల్లి ముకుందం,తాలూక సంపత్, బోడ బొరయ్య,లంజపెల్లి కిరణ్,బూర్గుల సతీష్,బుజ్జి తదితరులు పాల్గొన్నారు..

సూర్య 'సీన్' చిత్రంలో విలన్‌గా నస్లేన్..
గ్లింప్స్ విడుదల!



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'సీన్'. కరుప్పు, విశ్వానాథన్ ఆండ్ సన్స్ వంటి వైవిధ్యమైన చిత్రాలతో దూసుకెళ్తున్న సూర్య ఈ చిత్రంతో మరోసారి బాక్సాఫీస్ వద్ద సరికొత్త సంచలనాలు సృష్టించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమాతో మలయాళ టాలెంటెడ్ నటుడు నస్లేన్ తమిళ చిత్ర పరిశ్రమలోకి గ్రాండ్‌గా అడుగుపెడుతున్నారు. ఇక బ్లాక్‌బస్టర్ మూవీ 'ఆవేశం' ఫేమ్ జితు మాధవన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

తాజాగా ఈ సినిమాకు సంబంధించి చిత్ర యూనిట్ విడుదల చేసిన అప్‌డేట్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో నస్లేన్ 'ఈశ్వరన్' అనే విలన్ పాత్రలో కనిపించబోతున్నారు. ఇక ఈ చిత్రంలో హీరో సూర్య ఒక శక్తివంతమైన పోలీస్ అధికారిగా డి.ఎస్.పి. ఇన్బరాజ్ పాండియన్ పాత్రలో కనిపించనున్నారు. సూర్య సరసన నజ్రియా ఫహద్ నటిస్తుండగా, మలయాళ సంగీత సంచలనం సుషిన్ శ్యామ్ సంగీతం అందిస్తున్నారు. సూర్య జ్యోతికల నూతన ప్రొడక్షన్ హౌస్ 'జగరం స్టూడియోస్' మరియు '2ఆ ఎంటర్‌టైన్‌మెంట్' సంయుక్తంగా ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నాయి. అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమాను ప్రపంచవ్యాప్తంగా దీపావళి కానుకగా నవంబర్ 6, 2026న థియేటర్లలో అట్టహాసంగా విడుదల చేయనున్నారు. నస్లేన్ విలన్ ఎంట్రీ, సూర్య పోలీస్ గెటప్ కలిసి ఈ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చాయి.

Vaishnavi Chaitanya


ఎన్నో అవమానాలు ఎదుర్కొని ఈస్థాయికి వచ్చా..
యంగ్ హీరోయిన్ ఎమోషనల్ కామెంట్స్



డిజిటల్ కంటెంట్‌తో యూట్యూబ్ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా గుర్తింపు తెచ్చుకున్న యంగ్ బ్యూటీ వైష్ణవి చైతన్య.. 'బేబీ' మూవీలో హీరోయిన్‌గా నటించి ఒక్కసారిగా భారీ క్రేజ్ సొంతం చేసుకుంది. తన సహజమైన నటనతో యువ ప్రేక్షకులకు దగ్గరైన ఈ అమ్మడు.. తెలుగు సినీ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళంలో కూడా సినిమాలు చేస్తూ అలరిస్తుంది.

ఇందులో భాగంగానే ఇటీవల 'ఎపిక్: ది ఫస్ట్ సెమిస్టర్'తో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్న వైష్ణవి.. ఇప్పుడు తమిళ హీరో ఆర్య హీరోగా, హలితా షమీమ్ దర్శకత్వంలో రాబోతున్న రొమాంటిక్ డ్రామా 'హలో కాదల్' చిత్రంలో నటిస్తుంది. ఇలా ప్రస్తుతం వరుస సినిమాలతో సందడి చేస్తున్న వైష్ణవి చైతన్య.. తన కెరీర్ తొలినాలలో ఎదుర్కొన్న చేదు అనుభవాలను తాజాగా పంచుకున్నారు. ఈ మేరకు ఓ ఇంటర్వ్యూలో పాల్గొని.. కారవాన్ ఉపయోగించుకోవచ్చా అని అడిగితే ఎదురైన సమాధానం తనను ఎంతగానో బాధించిందని వైష్ణవి చైతన్య పంచుకున్నారు. చిన్న పాత్రల్లో నటిస్తున్న రోజుల్లో వాష్‌రూమ్ అవసరం కోసం ఓ సీనియర్ నటిని అడగ్గా, ఆమె నిరాకరించి అసిస్టెంట్ డైరెక్టర్‌ను సంప్రదించమన్నారని తెలిపారు. అప్పటి అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ.. ఎన్నో కష్టాల తర్వాతే ఈ స్థాయికి చేరుకున్నానని ఎమోషనల్ అయ్యారు.

విమర్శలు ఎదురైన తగ్గేదేలే..
నెట్‌ఫ్లిక్స్‌లో నంబర్ వన్‌గా 'ది ప్యారడైజ్', నాని ఖాతాలో మరో రికార్డు!



నేచురల్ స్టార్ నాని నటించిన తాజా చిత్రం 'ది ప్యారడైజ్' ఓటీటీలోనూ సందడి చేస్తోంది. థియేటర్లలో విడుదలై ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్‌లో పలు భాషల్లో అందుబాటులోకి వచ్చింది. థియేట్రికల్ రన్ ముగిసిన తర్వాత డిజిటల్ వేదికపైకి వచ్చిన ఈ చిత్రం, విడుదలైన కొద్దికాలంలోనే టాప్ చార్ట్‌లో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ముఖ్యంగా సినిమా చిత్రీకరణ, కథన శైలిపై కొందరు ప్రేక్షకుల నుంచి విమర్శలు వచ్చినప్పటికీ, ఓటీటీలో మాత్రం మంచి ఆదరణ పొందుతుండటం ఆసక్తికరంగా మారింది. 'ది ప్యారడైజ్' నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన వెంటనే భారతదేశంలోని టాప్ 10 సినిమాల జాబితాలో మొదటి స్థానానికి చేరుకుంది. కొత్త సినిమాలు ఓటీటీలోకి వచ్చినప్పుడు చార్ట్‌ల్లోకి రావడం సాధారణమే అయినప్పటికీ, ఈ చిత్రం అగ్రస్థానాన్ని అందుకోవడం ప్రత్యేకంగా చర్చకు దారితీసింది.

థియేటర్లలో సినిమా చూసిన ప్రేక్షకుల నుంచి భిన్నమైన స్పందనలు వచ్చాయి. ముఖ్యంగా చిత్రీకరణ విధానం, కథను తెరపై ఆవిష్కరించిన తీరు వంటి అంశాలపై కొందరు విమర్శలు వ్యక్తం చేశారు. అయినప్పటికీ, ఓటీటీలో విడుదలైన తర్వాత ఈ సినిమాను చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తి చూపిస్తున్నట్లు నెట్‌ఫ్లిక్స్ చార్ట్‌ల్లోని స్థానం సూచిస్తోంది. 'ది ప్యారడైజ్' చిత్రానికి శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించారు. గతంలో తనదైన కథన శైలితో గుర్తింపు తెచ్చుకున్న ఆయన, ఈ సినిమాను కూడా ప్రత్యేకమైన రీతిలో తెరకెక్కించారు. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మించారు.

ఈ సినిమాలో నాని సరసన కాయదు లోహర్ కథానాయికగా నటించారు. మోహన్ బాబు ప్రతినాయకుడి పాత్రలో కనిపించగా, రాఘవ్ జయల్, సోనాలి కులకర్ణి, సంపూర్ణేష్ బాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందించారు. నటీనటుల ఎంపిక, సంగీతం, కథను తెరకెక్కించిన విధానం వంటి అంశాలతో ఈ సినిమా విడుదలకు ముందే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. థియేటర్లలో మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, ఇప్పుడు ఓటీటీలో టాప్ స్థానాన్ని అందుకోవడంతో మరోసారి వార్తల్లో నిలిచింది.

ప్రదీప్ రంగనాథన్ నిర్మాతగా
తరుణ్ భాస్కర్ క్రేజీ ఎంటర్‌టైనర్!



టాలీవుడ్ మరియు కోలీవుడ్‌లో తనదైన నటనతో విశేష ప్రేక్షకాదరణ పొందిన యువ నటుడు ప్రదీప్ రంగనాథన్ ఇప్పుడు నిర్మాతగా కొత్త ప్రయాణాన్ని మొదలు పెట్టనున్నారు. తన సొంత ప్రొడక్షన్ హౌస్‌లో తెరకెక్కనున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి సంబంధించిన లేటెస్ట్ అప్‌డేట్ సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. అందిన సమాచారం ప్రకారం.. ఈ సినిమాలో ముందుగా ఓ కీలక పాత్ర కోసం ప్రముఖ డైరెక్టర్ అశ్వత్ మారిముత్తును అనుకున్నారు. అయితే కొన్ని మార్పుల కారణంగా ఆయన స్థానంలో టాలెంటెడ్ డైరెక్టర్ కమ్ యాక్టర్ తరుణ్ భాస్కర్ ఎంపికయినట్లు తెలుస్తుంది. తరుణ్ భాస్కర్ ఈ చిత్రంలో ఒక వైవిధ్యమైన పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. మహిళా ప్రాధాన్యత ఉన్న ఈ సరికొత్త కథాంశంతో రూపొందుతున్న చిత్రంలో మమితా బైజు కథానాయికగా నటిస్తున్నారు. నటుడిగానే కాకుండా నిర్మాతగా కూడా సత్తా చాటేందుకు సిద్ధమవుతున్న ప్రదీప్ రంగనాథన్ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.

శ్రీకార్తిక్ దర్శకత్వంలో రుక్మిణి వసంత్ క్రేజీ రోడ్ ట్రిప్ చిత్రం..
ప్రోమో విడుదల!



టాలీవుడ్, కోలీవుడ్ వర్గాల్లో ప్రస్తుతం ఎంతో ఆసక్తిని రేకెత్తిస్తోన్న ఒక క్రేజీ రోడ్ ట్రిప్ కామెడీ డ్రామా చిత్రంలో టాలెంటెడ్ హీరోయిన్ రుక్మిణి వసంత్ భాగమయ్యారు. యువ దర్శకుడు శ్రీకార్తిక్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో ఆమె 'తార' అనే వైవిధ్యమైన పాత్రలో ప్రేక్షకులను అలరించనున్నారు. ఈ చిత్రంలో రుక్మిణి వసంత్ పాత్రకు సంబంధించిన ప్రత్యేక పరిచయ వీడియోను తాజాగా చిత్ర బృందం సోషల్ మీడియా వేదికగా విడుదల చేసింది.

ఈ ఫన్నీ ప్రోమోలో దర్శకుడు శ్రీకార్తిక్ చాలా వినోదాత్మక రీతిలో కథను వివరించడం, ఆ నరేషన్ సచ్చడంతో రుక్మిణి ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా వెంటనే ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం చూపించారు. ఈ ప్రమోషనల్ వీడియో ప్రస్తుతం సినీ ప్రియులను ఎంతగానో ఆకట్టుకుంటూ వైరల్ అవుతోంది. ఈ వినోదాత్మక రోడ్ ట్రిప్ చిత్రంలో దేవ్ రామ్‌నాథ్, వినయ్ వంటి ప్రముఖ నటులు కూడా ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడికానుండగా, చిత్ర యూనిట్ త్వరలోనే అధికారిక టైటిల్‌ను కూడా ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తోంది.

'ఇడుపు కాయితం' నుంచి సెకండ్ సింగిల్
'గడప' పాట విడుదల



టాలీవుడ్ కథానాయకుడు ప్రియదర్శి హీరోగా, తెలంగాణ జానపద గాయని నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తున్న తాజా చిత్రం 'ఇడుపు కాయితం'. ప్రముఖ నిర్మాత బన్నీ వాస్ నిర్మాణంలో సుకుమార్ రైటింగ్స్ -- బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్లపై ఈ సినిమా తెరకెక్కుతోంది. వంశీరెడ్డి దొండపాటి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన మొదటి సాంగ్ 'శ్రీలత.. ఈ శ్రీనివాసుడే నీ జత..' పాట ప్రస్తుతం వైరలవుతుండగా తాజాగా సెకండ్ సింగిల్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ గడప పాటను విడుదల చేయగా.. పెళ్లైన అనంతరం కొత్త కోడలు ఇంటికి వచ్చిన నేపథ్యంలో ఈ పాట సాగుతుంది. ఈ పాటకు అభినయ శ్రీనివాస్ సాహిత్యం అందించగా.. తేజు విజయ పాడారు. సురేష్ బొబ్బిలి సంగీతం అందించారు.